సాక్షి
నిజామాబాద్
మంగళవారం, 24, జూన్, 2025



ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ
ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి.
- 8లో ▸



హాట్ టాపిక్‌గా..
రాష్ట్రంలో రాజకీయ దుమారం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కామారెడ్డిలోనూ హాట్‌టాపిక్‌గా మారింది.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.5 /24.8

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రేపు నగరంలో జాబ్ ఫెయిర్



నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిజామాబాద్ నగరంలోని ఐటీ టవర్స్‌లో 25వ తేదీన జాబ్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా, ప్రాంతీయ కేంద్రాల రాష్ట్ర అధికారి నవీన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ ఫెయిర్ ద్వారా డిప్లొమా, బీఈ/బీటెక్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువతకు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. పరిశ్రమ అవసరాలకు తగిన నైపుణ్యాలతో యువతను తీర్చిదిద్దడమే టాస్క్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నిజామాబాద్ పరిసర ప్రాంతాల విద్యార్థులు, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తమ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.


నేటి నుంచి పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

నిజామాబాద్‌అర్బన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి సంబంధించిన పాలిటెక్నిక్–25 మొదటి విడుత కౌన్సెలింగ్ ప్రక్రియను నేటి(మంగళవారం) నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయకర్త పి.భారతి, సిస్టమ్ అడ్మిన్ నితిన్‌పవార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్లాట్ బుకింగ్ చేసుకోవడానికి 24 నుంచి 28వ తేదీ వరకు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ 26 నుంచి 29 వరకు, ఆప్షన్ ఎంపికలు 26 నుంచి జూలై 1 వరకు ఉంటుందని వివరించారు. తెలిపారు. జూలై 4వ తేదీలోగా సీట్ అలాట్ అవుతుందని పేర్కొన్నారు.

అర్వింద్ చేసింది శూన్యం

వేల్పూర్: ఎంపీగా రెండుసార్లు గెలిచిన అర్వింద్ జిల్లాకు, నియోజకవర్గానికి చేసింది శూన్యమని, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఇతరులపై మతిలేని మాటలు మాట్లాడుతున్నారని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. కేసీఆర్‌ను విమర్శించేందుకు అర్వింద్‌కు ఏ మాత్రం అర్హత, స్థాయి లేదన్నారు. ఉద్యమకారులైన కేటీఆర్, హరీశ్‌రావు, కవితల వ్యక్తిత్వ హననం చేస్తూ అర్వింద్ మాట్లాడిన దిగజారుడు మాటలు ఆయన స్థాయిని సూచిస్తున్నాయని మండిపడ్డారు. 71 ఏళ్ల కేసీఆర్ ముసలివాడైతే.. 74 ఏళ్లు ఉన్న మోదీని ఏమనాలని ప్రశ్నించారు. రాజకీయంగా సమాధి అయ్యాడనుకున్న సమయంలో అర్వింద్ తండ్రి డీఎస్‌ను మళ్లీ ఎంపీని చేసి వెలుగులోకి తెచ్చింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ద్వారా లబ్ధి పొందేందుకు బీజేపీ ఎంపీలు బీఆర్‌ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం, హామీల అమలు కోసం బీఆర్‌ఎస్ పోరాడుతోందన్నారు.

సమాంతర వ్యవస్థలకు
చెక్ పడేనా..





- వీడీసీలు మంచి పనులు చేస్తున్నా.. అంతకు మించి దౌర్జన్యాలు
- పలుచోట్ల చెలరేగిపోయిన గ్రామ అభివృద్ధి కమిటీలు
- ప్రభుత్వ యంత్రాంగం పెట్టిన కేసులనూ లెక్కచేయని తెగింపు
- గ్రామాల్లో పలు కుటుంబాలను బహిష్కరించిన వైనం
- ఇటీవల కొన్ని వీడీసీలకు శిక్షలు విధించిన కోర్టు
- జక్రాన్‌పల్లి వీడీసీని రద్దు చేసినట్లు ప్రకటించిన సభ్యులు

రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తూ గ్రామాల్లో సమాంతర పాలన సాగిస్తున్న గ్రామ కమిటీల ఆగడాలకు ఇప్పటి వరకు అడ్డుకట్ట లేకపోయింది. గ్రామాల్లో సామాజిక బహిష్కరణ లాంటి దురాగతాలకు పాల్పడిన ఈ కమిటీల మనుగడ ఎక్కువ కాలం సాగదనే అభిప్రాయం వ్యక్తమ వుతోంది. ఇటీవల రెండు వీడీసీల సభ్యులకు జైలు శిక్షలు ఖరారైన నేపథ్యంలో జక్రాన్‌పల్లి వీడీసీని రద్దు చేస్తున్నట్లు సభ్యులే ప్రకటించడం ఇందుకు నిదర్శనమని పలువురు పేర్కొంటున్నారు. జిల్లాలో పలు వీడీసీలపై ఇప్పటికే కేసులు నమోదై ఉన్నాయి.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో అనేక గ్రామాల్లో వీడీసీ (గ్రామ అభివృద్ధి కమిటీ)లు రాజ్యాంగేతర అంశాలతో నిబంధనలను రూపొందించుకుని సమాంతర వ్యవస్థలను నడుపుతున్నాయి. అయితే ఈ వీడీసీలు కొన్ని మంచి కార్యక్రమాలు చేసినప్పటికీ అంతకు మించి దౌర్జన్యకాండలు నడిపిస్తుండడం గమనార్హం. వీటితో మంచి ఎంత ఉందో అంతకు మించి చెడు చోటుచేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ప్రభుత్వ అధికారులు పలు వీడీసీలపై వచ్చిన ఫిర్యాదులకు అనుగుణంగా కేసులు పెడుతున్నప్పటికీ ఆగడాలు మాత్రం ఆగడం లేదు. కొన్నేళ్ల క్రితం ఆర్మూర్‌లోని పెర్కిట్ వీడీసీ ఇళ్ల స్థలాల కేటాయింపు విషయంలో సీనియర్ రాజకీయ నాయకుడు బాజిరెడ్డి గోవర్ధన్‌ను గ్రామంలోకి రాకుండా ఆంక్షలు విధించడం గమనార్హం. చాలా గ్రామాల్లో పలు కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేసిన వీడీసీలు పలు చోట్ల పూర్తిగా కులాన్నే బహిష్కరించిన సందర్భాలు సైతం ఎక్కువే ఉన్నాయి. ఈ క్రమంలో ఆయా కులాల కుటుంబాల ఫిర్యాదులతో అధికారులు కేసులు నమోదు చేశారు. అయినా వీడీసీలు సమాంతర వ్యవస్థను నడుపుతూనే ఉన్నాయి.

■ ఐదు నెలల క్రితం వేల్పూర్ మండలంలోని పోచంపల్లిలో వీడీసీ ఒకే కులానికి చెందిన పది కుటుంబాలను సామాజికంగా బహిష్కరించింది. గ్రామంలో మూడు చోట్ల ఉన్న ప్రభుత్వ భూమిని ముగ్గురు వ్యక్తులకు అమ్మేందుకు వీడీసీ నిర్ణయించింది. దీనిపై గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాల వారు అభ్యంతరం చెప్పారు. ప్రభుత్వ భూములు అమ్మవద్దని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వేల్పూర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గ్రామంలో సర్వే నిర్వహించి సదరు స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు రంగం సిద్ధం చేశారు. ఆగ్రహించిన వీడీసీ సభ్యులు సదరు ఫిర్యాదు చేసిన కుటుంబాలకు రూ.3 లక్షల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో సామాజిక బహిష్కరణ చేస్తూ తీర్మానించారు. బాధిత కుటుంబాలకు చెందిన వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులకు ఫిర్యాదు చేయడాన్ని తప్పుబడుతూ వీడీసీ గ్రామంలో ఈ కుటుంబాలను సామాజికంగా బహిష్కరణ చేశామని, వీళ్లకు పాలు, కిరాణ తదితర వస్తువులు అమ్మవద్దని చాటింపు వేయించారు. పొలాల్లో పనిచేసేందుకు కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు సైతం వెళ్లవద్దని వీడీసీ అల్టిమేటం జారీ చేసింది. బహిష్కరించిన కుటుంబాలకు సంబంధించిన వ్యవసాయ పనులకు వెళితే వారికీ జరిమానాలు విధిస్తామని ప్రకటించడం గమనార్హం. అలాగే పోలీసులకు ఫిర్యాదు చేసినందుకు రూ.10 లక్షలు జరిమానా చెల్లించాల్సిందేనని హుకుం జారీ చేయడం వీడీసీల దురాగతానికి అద్దం పడుతోంది. పలు పరిణామాల నేపథ్యంలో పోలీసులు గత జనవరి 31న ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ వీడీసీ సభ్యుల తీరు మారలేదు. నాన్ బెయిలబుల్ కేసులు పెట్టాల్సిన నేపథ్యంలో సాధారణ స్టేషన్ బెయిల్ కేసులు మాత్రమే నమోదు చేయడంతో వీడీసీ సభ్యులు బాధిత కుటుంబాలను మరింత ఇబ్బందులు పెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పటికైనా ఈ సమాంతర వ్యవస్థలకు ప్రభుత్వ యంత్రాంగం చెక్ పెట్టాలని డిమాండ్లు బలంగా వస్తున్నాయి.

■ వీడీసీల పేరిట ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న వ్యవస్థలు ప్రభుత్వానికి సమాంతరంగా సుప్రీం అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో మనుషులు, జంతువులు, భూములు అన్నింటిపై తమదే పెత్తనం అన్నట్లుగా ఈ వీడీసీలు చెలరేగిపోతున్నాయి. మేమే రాజులం.. మేమే మంత్రులం అన్నవిధంగా గ్రామంలో పాలన నుంచి మొదలు తాము చెప్పిందే న్యాయం అన్నట్లుగా వీడీసీ సభ్యులు వ్యవహరిస్తున్నారు. చివరకు పాల ప్యాకెట్లు, కోడి గుడ్లు ఎవరు అమ్ముకోవాలో, ఎంత ధరకు అమ్ముకోవాలో అనేది కూడా ఈ వీడీసీలే నిర్ణయిస్తున్న పరిస్థితి. ఈ వీడీసీల ఆగడాలు తరచూ వెలుగులోకి వస్తున్నప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో మళ్లీ మళ్లీ పునరావృతం అవుతూ వచ్చాయి.

మొట్ట మొదటిసారి..

జక్రాన్‌పల్లి మండలంలోని మునిపల్లి, కొలిప్యాక్ గ్రామాల్లో వీడీసీ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. ఇందుకు సంబంధించి వీడీసీల సభ్యులకు కోర్టు శిక్షలు ఖరారు చేసింది. గరిష్ఠంగా ఐదు సంవత్సరాలు శిక్షలు పడిన సభ్యులు ఉన్నారు. ఇక ఏర్గట్ల మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామంలో తమను బహిష్కరించిన నేపథ్యంలో గౌడ కులస్తులు కేసు పెట్టారు. తాళ్లరాంపూర్‌లో తాటి చెట్ల వివాదంలో సదరు గౌడ కులస్తుల వద్ద గ్రామస్తులెవరూ కల్లు తాగొద్దంటూ వీడీసీ తీర్మానం చేసింది. ఇప్పటికీ ఈ తీర్మానం అమలులో ఉంది. దీనిపై ప్రస్తుతం ఈ కేసు కోర్టులో నడుస్తోంది. ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లాలో పలు వీడీసీలపై అనేక కేసులు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా కేసులు నమోదై, శిక్షలు ఖరారైన నేపథ్యంలో జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో పలు వివాదాలకు కేంద్రమైన తమ వీడీసీని రద్దు చేస్తున్నట్లు సభ్యులు ప్రకటించారు. ఇలా ఒక వీడీసీని రద్దు చేస్తున్నట్లు పత్రికా ముఖంగా ప్రకటించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఇక్కడి నుంచి మార్పుకు నాంది పలికినట్లేనని పలువురు పేర్కొంటున్నారు.

29న రైతు సమ్మేళనం



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్ ధర్మపురి

- నిజామాబాద్‌కు రానున్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా
- జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించనున్న మంత్రి
- అదే రోజు పీసీసీ మాజీ చీఫ్ డీఎస్ విగ్రహావిష్కరణ
- మీడియాతో ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో ఈనెల 29వ తేదీన నిర్వహించే రైతు సమ్మేళనానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానున్నారని, కార్యక్రమానికి రైతులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి కోరారు. శ్యామప్రసాద్ ముఖర్జీ వర్ధంతి బలిదాన్ దివస్ సందర్భంగా సోమవారం పార్టీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్యామప్రసాద్ ముఖర్జీ త్యాగం వల్లే కశ్మీర్ దేశ భూభాగంలో అంతర్భాగమైందని, ఆయన త్యాగాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలు మర్చిపోలేరని పేర్కొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

నాలుగు దశాబ్దాల పసుపు రైతుల చిరకాల వాంఛ అయిన పసుపు బోర్డు జాతీయ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు అమిత్ షా వస్తున్నారని అర్వింద్ తెలిపారు. పసుపు, ఇతర పంటల రైతుల భవిష్యత్ తీర్చిదిద్దే కార్యచరణ, ప్రణాళిక ప్రకటించే అవకాశముందని తెలిపారు. అదేరోజు మాజీమంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు డీఎస్ ప్రథమ వర్ధంతి సందర్భంగా తన వ్యక్తిగత విజ్ఞప్తి మేరకు కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో ఆయన కాంస్య విగ్రహాన్ని అమిత్ షా ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. పద్మభూషణ్ అవార్డు గ్రహీత, సర్దార్ వల్లభా బాయ్ విగ్రహ శిల్పి రామ్ సుతార్ డీఎస్ విగ్రహాన్ని తయారు చేశారన్నారు. డీఎస్ విగ్రహ ఏర్పాటుకు మున్సిపల్ కార్పొరేషన్ తీర్మానం చేయడంతోపాటు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి ఎంపీ ధన్యవాదాలు తెలిపారు. పసుపు బోర్డు కేంద్ర కార్యాలయానికి శాశ్వత భవనం కోసం జెడ్పీ వెనక ప్రాంతంలో రెండెకరాల స్థలం కేటాయించాలని విన్నవించామని, ఈ ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

రాజకీయంగా ప్రాధాన్యత కలిగిన, ఉద్యమాలకు ఊపిరిలూదిన నిజామాబాద్ జిల్లాకు మంత్రి పదవి రాకపోవడం దురదృష్టకరమని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను కోరింది తానేనని, పార్టీ లీగల్ సెల్‌కు ఆ బాధ్యత అప్పగించాలని కోరానన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేశ్, నాయకులు మోహన్‌రెడ్డి, న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, స్రవంతిరెడ్డి పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి



మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సూర్యం, పద్మ

- టీయూసీఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సూర్యం, ఎల్ఎస్ పద్మ డిమాండ్

నిజామాబాద్ సిటీ : ఆదివాసీల హక్కులను కాలరాస్తూ.. వారి జీవనాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్న మిలటరీ ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యం, ఎస్ఎల్ పద్మ డిమాండ్ చేశారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోటగల్లి ఎన్ఆర్‌భవన్‌లో జరిగిన రాష్ట్ర మహాసభలో వారు మాట్లాడారు. ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికాల దాడిని ఖండించారు. దాడులను తక్షణమే ఆపాలని, యుద్ధం వల్ల కార్మికులు, ప్రజలు నష్టపోతారని మహాసభ తీర్మానించింది. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదివాసీల హననానికి పాల్పడుతున్న స్థితిని తక్షణమే నిలిపివేయాలని, కార్పొరేట్ సంస్థలు, అంబానీ ఆదానీలకు ఖనిజ సంపదలను అప్పగించే చర్యలను మానుకోవాలని మహాసభ డిమాండ్ చేసింది. మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చడాన్ని, కార్మికుల కనీస ప్రయోజనాలు కల్పించే చట్టాలను రద్దు చేయడాన్ని తీవ్రంగా నిరసించింది. లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని, పని గంటల పెంపును నిలిపివేయాలని మహాసభ డిమాండ్ చేసింది. తెలంగాణలో కార్మికులకు కనీస వేతనాలు అమలు చే యాలన్నది. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన రాష్ట్ర అధ్యక్షునిగా కె సూర్యం, కార్యదర్శిగా ఎస్ఎల్ పద్మలతోపాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎం నరేందర్, ఎం హన్మేశ్, జీ రామయ్య, కే రాజన్న, సీ వెంకటేశ్, సహాయ కార్యదర్శిగా ఎం వెంకన్న, ముత్తన్న, వి ప్రవీణ్, అరుణ్ కుమార్, యాకుబ్ షావలి, కోశాధికారిగా కిరణ్, సభ్యులుగా 26 మందిని ఎన్నుకున్నారు. టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం నరేందర్, సహాయ కార్యదర్శులు, ఎం ముత్తెన్న, ఎం వెంకన్న జిల్లా కార్యదర్శి ముస్కె సుధాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు రాజేశ్వర్, మల్లేష్, జిల్లా నాయకులు కిరణ్, రవి, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్ జిగేల్



కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా

- రూ.45 లక్షలతో కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా సుందరీకరణ
- దూరంకానున్న ట్రాఫిక్ ఇబ్బందులు
- కూడలిలో రోడ్డు విస్తరణకు చర్యలు
- హైమాస్ట్ లైట్లు.. సిగ్నల్ జంపింగ్ కెమెరాలు.. బారికెడ్లు
- నగరంలోని అతిపెద్ద చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యలకు చెక్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలో అతిపెద్ద చౌరస్తాగా గుర్తింపు ఉన్న కంఠేశ్వర్ బైపాస్‌రోడ్డు చౌరస్తా సుందరీకరణకు మున్సిపల్ కార్పొరేషన్ శ్రీకారం చుట్టింది. ఇందు కోసం రూ.45 లక్షలు వెచ్చిస్తోంది. నాలుగు వైపుల నుంచి వచ్చే వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ఉండాలని, కరీంనగర్, నిర్మల్ తదితర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రంలోకి ప్రవేశించే వారికి, హైదరాబాద్‌కు ప్రయాణించే మహారాష్ట్ర, బోధన్ ప్రాంత ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసింది. చౌరస్తాలో రోడ్డును విస్తరించడంతోపాటు స్టాప్ లైనర్‌లు, బారికేడ్లు, హైమాస్ట్ లైట్లు, సిగ్నల్ జంపింగ్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే అటవీశాఖ అనుమతితో చెట్లను తొలగించారు. పనులు పూర్తయితే ట్రాఫిక్ ఇబ్బందులు దూరంకానున్నాయి. కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా సుందరీకరణతో నగరానికి కొత్త అందం రానుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

భారీ ట్రాఫిక్

మాధవనగర్ బైపాస్, ఆర్మూర్ వైపు నుంచి, నిజామాబాద్ నగరంలో నుంచి కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా మీదుగా భారీ సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి వేళల్లో భారీ వాహనాలు ఎక్కువగా వెళ్తుంటాయి. మాధవనగర్ ఆర్వోబీ పనులు పూర్తి కాకపోవడంతో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు చౌరస్తా మీదుగా వెళ్తున్నాయి. ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రాక్రాసింగ్ లైన్లు, ఆటోమెటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైషన్ (ఏఎన్‌పీఆర్) గుర్తింపు ఉన్న కెమెరాలను అమరుస్తారు.



డీఎస్ విగ్రహం ఏర్పాటు

మాజీ మంత్రి, మాజీ పీసీసీ చీఫ్ ధర్మపురి శ్రీనివాస్ విగ్రహాన్ని కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో ఏర్పాటు చే యాలని మున్సిపల్ పాలకవర్గం తీర్మా నించిన విషయం తెలిసిందే. ఈ మేరకు చౌరస్తాలో గద్దె నిర్మాణం పూర్తికావడంతోపాటు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ పనులు పూర్తికాగానే ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించిన పనులను మున్సిపల్ కార్పొరేషన్ ప్రారంభించనుంది.

“ఇబ్బందులు లేకుండా చూస్తాం

కంఠేశ్వర్ బైపాస్ సుందరీకరణలో భాగంగా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూస్తాం. అంతేకాకుండా సీసీ టీవీ ఫుటేజీలు, ఆటోమెటిక్ కెమెరాలు ఉంటాయి. దీంతోపాటు రాత్రివేళల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. దీనికి మున్సిపల్ కార్పొరేషన్ నిధులు కేటాయించింది. చెట్లను తొలిగించాలని అటవీశాఖ అధికారులకు లేఖ అందించాం. కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో ఇక ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవు. – ప్రసాద్, ట్రాఫిక్, సీఐ, నిజామాబాద్

ఇందిరమ్మ ఇళ్ల బాధ్యత వార్డు ఆఫీసర్లదే..

- 3,500 మందిని గుర్తించలేకపోతున్నారు
- ఇళ్ల మంజూరులో కార్పొరేషన్ టాప్‌లో ఉండాలి
- అధికారులతో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- పనుల పురోగతిపై బల్దియా కార్యాలయంలో సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టరేట్ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్ సిటీ: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చూడాల్సిన బాధ్యత వార్డు ఆఫీసర్లదేనని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. నాలుగున్నర లక్షల నిజామాబాద్ నగర జనాభాలో 3,500 మంది లబ్ధిదారులను గుర్తించకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం పురోగతిపై కమిషనర్ దిలీప్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ సోమవారం సుదీర్ఘంగా సమీక్షించారు. దరఖాస్తులు, అర్హులుగా గుర్తించినవారు, మంజూరుపత్రాల జారీ, ఇళ్ల నిర్మాణాలో ఏ దశలో ఉన్నాయని డివిజన్‌ల వారీగా వార్డు ఆఫీసర్ల నుంచి వివరాలు తెలుసుకున్నారు. తిరస్కరణకు గురైన దరఖాస్తుల వివరాలపై ఆరా తీసిన కలెక్టర్.. చిన్న చిన్న కారణాలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు చొరవ చూపాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో నిజామాబాద్ కా ర్పొరేషన్ టాప్‌లో ఉండాలన్నారు. మరో వారం త ర్వాత మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని, పురోగతి తప్పకుండా ఉండాలని సూచించారు. తప్పుడు నివేదిక ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. డెంగీ, మలేరియా, అతిసారం, విషజ్వరాలు వంటి వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

మెడికల్ కాలేజ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

- ఉమ్మడి జిల్లాలోని కాలేజీల బాధ్యతలు డీపీహెచ్‌కు..
- కమిటీలో కలెక్టర్లకు చోటు

కామారెడ్డి టౌన్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలలు, అనుబంధ బోధనాస్పత్రుల అభివృద్ధి, అత్యుత్తమ సేవలు అందేలా చూసేందుకు మెడికల్ కాలేజ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ)లను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలవారీగా ఏర్పాటు చేసిన కమిటీ కళాశాలల్లో తనిఖీలు చేపట్టనుంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎంసీఎంసీ కమిటీ...

నిజామాబాద్, కామారెడ్డి మెడికల్ కాలేజ్ మానిటరింగ్ కమిటీ ఇన్‌చార్జిగా డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(డీపీహెచ్) రవీందర్ నాయక్‌కు బాధ్యతలు అప్పగించారు. తనిఖీ కమిటీలో నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్లు వినయ్‌కృష్ణారెడ్డి, ఆశిష్ సంగ్వాన్‌లకు చోటు కల్పించారు. వీరు ఆయా జిల్లాల పరిధిలో బాధ్యులుగా ఉంటారు. కమిటీ సభ్యులుగా నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ శివప్రసాద్, తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిజామాబాద్ ఈఈ కుమార్‌లను నియమించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 25 నుంచి 29 మధ్య కమిటీ ప్రతినిధులు ఆయా కళాశాలల్లో తనిఖీలు చేపట్టాల్సి ఉంటుంది. కళాశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, ఇబ్బందులు, లోపాలు, సమస్యలపై నివేదికలను సిద్ధం చేసి ఈనెల 30న ప్రభుత్వానికి నివేదించాలని ప్రభుత్వం ఆదేశించింది. తనిఖీలలో భాగంగా కళాశాలలకు కావాల్సిన యాక్షన్ ప్లాన్‌ను కూడా రూపొందించనున్నారు.

ఆరు అంశాలపై తనిఖీలు..

ప్రధానంగా ఆరు అంశాలపై కమిటీ దృష్టి సారించాలని ప్రభుత్వం ఆదేశించింది. మొదటి అంశంలో మౌలిక సదుపాయాలు, భవనాలు, లెక్చరర్ హాళ్లు, ల్యాబ్‌లు, హాస్టళ్లు, పడకల సంఖ్య, వైద్య పరికారాలు, నీటి సరఫరా, శానిటేషన్ ఉన్నాయి. రెండో అంశంలో అధ్యాపకులు, సిబ్బంది పోస్టులు, ఖాళీలు, మూడో అంశంలో ఎన్ఎంసీ నిబంధనల మేరకు బోధన ప్రణాళిక అమలు, నాలుగో అంశంలో విద్యార్థుల సంక్షేమం, మెడికోలకు వసతి, సౌకర్యం, పరిసరాల పరిశుభ్రత, ర్యాగింగ్ నిరోధ చర్యలు, విద్యార్థుల ఫిర్యాదులున్నాయి. ఐదో అంశంలో ఆర్థికపరమైన అంశాలు, అవసరమైన నిధులు, ఆరో అంశంలో డిజిటల్ వ్యవస్థలో భాగంగా హాజరు అమలు, సీసీ టీవీలు, ఇంటర్నెట్ సౌకర్యం వంటివి ఉన్నాయి.

క్లుప్తంగా

నేడు తెయూలో జాతీయ సదస్సు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయం వాణిజ్య విభాగం, తెలంగాణ కామర్స్‌ అసోసియేషన్‌ సంయుక్తంగా 'వికసిత్‌ భారత్‌ – 2047, ట్రాన్స్‌ఫర్మేటివ్‌ రోల్‌ అఫ్‌ కామర్స్‌' అనే అంశంపై మంగళవారం జాతీ య సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు కార్యదర్శి ప్రొఫెసర్‌ గోపిశెట్టి రాంబాబు సోమవారం తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథిగా తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్‌ ప్రొఫెసర్‌ వీ బాలకిష్టారెడ్డి, అతిథులుగా ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ పబ్లిక్‌ ఎంటర్‌ప్రైజెస్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఎస్‌ శ్రీనివాస మూర్తి, తెలంగాణ కామర్స్‌ అసోసియేషన్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్‌ పీ పురుషోత్తమ రావు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. మానవ వనరుల నిర్వహణ, అకౌంటింగ్‌, ఆర్థికం, మార్కెటింగ్‌, పన్నులు, ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌, బ్లాక్‌చెయిన్‌, బిగ్‌ డేటా, ఆటోమేషన్‌ పై పరిశోధకులు, విద్యావేత్తలు, విద్యార్థులు పత్ర సమర్పణ చేస్తారని తెలిపారు.

రైతుల ఖాతాలలో రూ. 310.43 కోట్లు జమ

నిజామాబాద్‌అర్బన్‌: రైతు భరోసా పథకం కింద సోమవారం వరకు జిల్లాలోని 2,68,056 మంది రైతుల ఖాతాలలో రూ. 310.43 కోట్లు జమ అయ్యాయని కలెక్టర్‌ టీ వినయ్‌ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి పంట పెట్టుబడి సాయం కింద 22, 23వ తేదీలలో 4,643 మంది రైతుల ఖాతాలలో రూ. 22.65 కోట్లు జమ అయ్యాయని కలెక్టర్‌ వివరించారు.

పాఠశాలను సందర్శించిన జడ్జి



నిజామాబాద్‌రూరల్‌: రూరల్‌ పరిధిలోని సారంగాపూర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి విజయ భాస్కర రావు సోమవారం డీఈవో అశోక్‌తో కలిసి సందర్శించారు. పాఠశాలలో మరుగుదొడ్ల సమస్యపై మానవ హక్కుల కమిషన్‌ సుమోటోగా స్వీకరించి కలెక్టర్‌కు నోటీసు పంపింది. ఈ నేపథ్యంలో జడ్జి, డీఈవోలు పాఠశాలను పరిశీలించారు. కాంట్రాక్టర్‌ సుదర్శన్‌ను పిలిపించి 15 రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో గడువులోగా పూర్తిచేస్తానని కాంట్రాక్టర్‌ హామీ ఇచ్చారు. హెచ్‌ఎం డాక్టర్‌ సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

కాన్వొకేషన్‌కు ఏర్పాట్లు ముమ్మరం

- జూలై మూడో వారంలో నిర్వహణ!
- గవర్నర్‌ను ఆహ్వానించిన వీసీ
- పుష్కర కాలం తర్వాత రెండో కాన్వొకేషన్‌
- ఉత్సాహంగా ఎదురు చూస్తున్న విద్యార్థులు



తెయూ పరిపాలనా భవనం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో కాన్వొకేషన్‌ (స్నాతకోత్సవం) వచ్చే నెల మూడోవారంలో నిర్వహించనున్నారు. గత 12ఏళ్లుగా విద్యార్థులు, అధ్యాపకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తుండగా.. జూలై 17, 18వ తేదీల్లో నిర్వహించనున్నట్లు సమాచారం. స్నాతకోత్సవానికి హాజరుకావాలని గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మను వీసీ యాదగిరిరావు ఆహ్వానించగా ఆయన సుముఖత వ్యక్తం చేశా రు. అయితే గవర్నర్‌ కార్యాలయం నుంచి వచ్చే లేఖ ఆధారంగా కాన్వొకేషన్‌ నిర్వహణ తేదీపై స్పష్టత వచ్చే అవకాశం ఉండగా.. వర్సిటీ అధికారులు బిజీగా ఉన్నారు.

19 ఏళ్లలో ఒకేసారి కాన్వొకేషన్‌

కాన్వొకేషన్‌ అనేది వర్సిటీలో పెద్ద పండుగలా భావిస్తారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏడాదికోసారి కాన్వొకేషన్‌ నిర్వహించాలని యూజీసీ నిబంధనలు చెబుతున్నాయి. 2006 లో తెలంగాణ యూనివర్సిటీ ఏర్పడగా తొలి కాన్వొకేషన్‌ 2013 నవంబర్‌ 13న అప్పటి వీసీ ప్రొఫెసర్‌ అక్బర్‌ అలీఖాన్‌ హయాంలో నిర్వహించారు. ఆ తర్వాత ఆ ఊసే లేకుండాపోయింది.

దరఖాస్తులు..

కాన్వొకేషన్‌లో పట్టాల కోసం ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని వర్సిటీ అధికారులు ప్రకటించడంతో యూజీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తయిన విద్యార్థులు దరఖాస్తులు అందజేస్తున్నారు. ఇప్పటికే చాలామంది పీహెచ్‌డీ డాక్టరేట్‌ ఒరిజనల్‌ పట్టాలు తీసుకున్నారు. ఉన్నత చదువుల కోసం పలువురు పీజీ, యూజీ విద్యార్థులు కాన్వొకేషన్‌ పట్టాలు తీసుకున్నారు.

విద్యార్థులకు బంగారు పతకాలు

యూజీ, పీజీ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా బంగారు పతకాలు (గోల్డ్‌ మెడల్స్‌) అందజేసి సత్కరిస్తారు. పీహెచ్‌డీ డాక్టరేట్‌ సాధించిన వారికి అధికారికంగా పట్టాలు అందజేస్తారు. ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాకు చెందిన ప్రముఖులు, విద్యా సంస్థల అధిపతులు, స్వచ్ఛంద సేవకులు, రాజకీయ నేతలు, వివిధ రంగాల వారు గోల్డ్‌ మెడల్స్‌ కోసం వర్సిటీకి రూ.33.80 లక్షలు విరాళం ఇచ్చారు. ఈ డబ్బును వర్సిటీ ఉన్నతాధికారులు బ్యాంకులో డిపాజిట్‌ చేశారు. ఆ డిపాజిట్‌పై వడ్డీ రూపంలో వచ్చే మొత్తంతో విద్యార్థులకు అందజేసేందుకు 132 బంగారు పతకాలు తయారు చేయించారు. గోల్డ్‌ మెడల్స్‌ను పీహెచ్‌డీ పట్టాలను మాత్రమే గవర్నర్‌ చేతుల మీదుగా అందజేస్తారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

- అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి
- కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్‌, ఇతర అధికారులు

నిజామాబాద్‌ అర్బన్‌: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్‌ టీ వినయ్‌ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 217 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌, ట్రెయినీ కలెక్టర్‌ కరోలిన్‌ చింగ్తియాన్‌ మావీ, డీఆర్డీవో సాయాగౌడ్‌, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్‌, మెప్మా పీడీ రాజేందర్‌లకు అర్జీలు సమర్పించారు.

బాధితులకు త్వరగా పరిహారం చెల్లించాలి

పోక్సో చట్టం కింద కేసులు నమోదు అయిన అనంతరం దాని బాధితులకు త్వరగా పరిహారం చెల్లించాలని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో సోమవారం పోక్సో చట్టం, అట్రాసిటీ బాధితుల పరిహారం, మహిళలు, బాలికలపై జరిగిన దారుణాలకు సంబంధించి పరిహారం చెల్లింపుపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ బాధితులకు పరిహారం చెల్లింపుల్లో నిర్లక్ష్యం చేయవద్దని సంక్షేమ అధికారిణి, మహిళా శిశు సంక్షేమ అధికారికి ఆదేశించారు. అర్హత కలిగిన 86 కేసులను జిల్లా స్థాయి కమిటీ సమావేశం ఆమోదించింది. సీపీ సాయిచైతన్య, ప్రాజెక్టు డైరెక్టర్‌, డీఆర్డీవో సాయాగౌడ్‌ , డీఎంహెచ్‌వో రాజశ్రీ, డీఈవో అశోక్‌, జిలా సంక్షేమ అధికారిణి ఎస్‌కే రసూల్‌ బీ, ఏజీవో స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరించిన సీపీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీపీ

ఖలీల్‌వాడి: జిల్లా పోలీస్‌ ప్రధాన కార్యాలయంలో సీపీ సాయి చైతన్య సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్ట ప్రకారం పరిష్కరించాలని సంబంధిత సీఐ, ఎస్సైలకు అధికారులకు సూచించారు. ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలను పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా పని చేస్తున్నామని సీపీ తెలిపారు.

హాట్‌ టాపిక్‌గా ఫోన్‌ ట్యాపింగ్‌

- పలువురికి సిట్‌ అధికారుల నుంచి ఫోన్లు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రాష్ట్రంలో రాజకీయ దుమారం లేపుతున్న ఫోన్‌ ట్యాపింగ్‌ వ్యవహారం కామారెడ్డిలోనూ హాట్‌టాపిక్‌గా మారింది. స్థానికంగా పలువురు నేతలకు ప్రత్యేక దర్యాప్తు బృందం పోలీసు అధికారులు ఫోన్లు చేసి ట్యాపింగ్‌ జరిగిన విషయంలో వాంగ్మూలం ఇవ్వడానికి రావాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి సీఎం కేసీఆర్‌, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి నుంచి పోటీ చేసిన విషయం తెలిసిందే. దీంతో కామారెడ్డి హాట్‌సీట్‌గా మారిపోయింది. ఆ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు ఇద్దరు కీలక నేతలను కాదని బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డిని గెలిపించారు. అయితే ఎన్నికల సమయంలో కామారెడ్డి కేంద్రంగా ఫోన్‌ ట్యాపింగ్‌ పెద్ద ఎత్తున జరిగిందన్న ప్రచారం జరిగింది. ఇటీవల ఫోన్‌ ట్యాపింగ్‌ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు కామారెడ్డికి చెందిన పలువురికి ఫోన్‌లు చేసి ఫోన్‌ ట్యాపింగ్‌కు సంబంధించి సమాచారం కోసం పిలుస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన న్యాయవాది, కాంగ్రెస్‌ లీగల్‌ సెల్‌ నాయకుడు దేవరాజ్‌గౌడ్‌కు సిట్‌ అధికారుల నుంచి ఫోన్‌ రాగా ఆయన మూడు నాలుగు రోజుల్లో వస్తానని వారికి సమాచారం ఇచ్చారు. అలాగే ఇటీవలే పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గడ్డం చంద్రశేఖర్‌రెడ్డికి కూడా సిట్‌ అధికారుల నుంచి ఫోన్‌ వచ్చింది. ఆయనతో పాటు మరో ఎనిమిది మందికి కూడా అధికారులు ఫోన్‌ చేసి హైదరాబాద్‌కు రావాలని సూచించారు. బుధవారం ఉదయం 11 గంటలకు సిట్‌ వద్ద సాక్షిగా తన వాంగ్మూలం ఇవ్వనున్నట్లు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి 'సాక్షి'తో తెలిపారు.

బాధితులు ఎందరో..

జిల్లాలో ఫోన్‌ ట్యాపింగుకు గురైనవారు ఎందరున్నారో అన్న చర్చ నడుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర రాజకీయాలన్నీ కామారెడ్డి నియోజకవర్గం చుట్టే తిరిగాయి. ఇద్దరు ఉద్దండులను వెంకటరమణారెడ్డి ఓడించడం అప్పట్లో సంచలనం కలిగించింది. కాగా కామారెడ్డిలో ఎందరి ఫోన్లు ట్యాపింగ్‌కు గురయ్యాయన్న దానిపై చర్చ నడుస్తోంది.

కలెక్టర్‌ను కలిసిన ట్రెయినీ కలెక్టర్‌



నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాకు ట్రెయినీ కలెక్టర్‌గా వచ్చిన 2024 బ్యాచ్‌ ఐఏఎస్‌ అధికారిణి కరోలిన్‌ చింగ్తియాన్‌ మావీ సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్‌ టీ వినయ్‌ కృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. గత ఏప్రిల్‌ నెలలో ట్రెయినీ కలెక్టర్‌గా నిజామాబాద్‌ జిల్లాకు కేటాయించబడిన కరోలిన్‌ చింగ్తియాన్‌ మావీ, నెలన్నరపాటు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. సోమవారం జిల్లాకు తిరిగి వచ్చిన సందర్భంగా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఇక్కడే ఉంటాం..!

- బదిలీలకు ససేమిరా అంటున్న 'సెర్ప్‌' ఉద్యోగులు
- మినహాయింపు కోసం పలువురు డీపీఎంల పైరవీలు?
- లేని రోగాలను ఉన్నట్లు చూపుతున్న వైనం

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్‌)లో చేపడుతున్న ఉద్యోగ బదిలీల్లో అప్పుడే పైరవీలు మొదలయ్యాయి. ప్రస్తుతం డీపీఎంల వంతు రాగా ఈ నెల 25న బదిలీలకు కౌన్సెలింగ్‌ జరగనుంది. ఈ నేపథ్యంలో ఏళ్లుగా తిష్టవేసిన కొంత మంది ఉద్యోగులు ఇతర జిల్లాలకు వెళ్లేందుకు ససేమిరా అంటున్నారు. దీర్ఘకాలంగా జిల్లా కార్యాలయంలో పాతుకుపోగా, ఇంకా ఇక్కడే ఉండాలన్న కోరికతో ఉన్నారు. ఇటీవల బదిలీల కోసం పక్క జిల్లాలకు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉన్నా, ప్రస్తుతం కొనసాగుతున్న జిల్లాకే మొదటి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిసింది. తమను యథా స్థానాల్లోనే కొనసాగించాలని ఉన్నతాధికారులపై రాజకీయ ఒత్తిళ్లు చేయిస్తున్నట్లు సమాచారం. సెక్షన్లు మార్చినా పర్వాలేదని, మమ్మల్ని మాత్రం జిల్లా నుంచి కదిలించవద్దని వేడుకున్నట్లు తెలుస్తోంది. ఐతే, సొంత జిల్లాలోనే ఉండాలంటే స్పౌజ్‌ అంశాన్ని సెర్ప్‌ అధికారులు పరిశీలిస్తారు. కానీ, కొందరు లేని రోగాలను ఉన్నట్లుగా చూపించి డాక్టర్‌ సర్టిఫికెట్లు సృష్టించినట్లు విశ్వసనీయ సమాచారం. అనారోగ్య సమస్యలను అడ్డుపెట్టుకుని జిల్లాలోనే తిష్టవేయాలని చూస్తున్నారు.

పట్టు పోతుందనే..

జిల్లాలో అన్ని విధాలుగా స్థిరపడిన ఉద్యోగులు వ్యాపారాలు కూడా సాగిస్తున్నారు. జిల్లా కార్యాలయంలో అన్ని సెక్షన్లపై మంచి పట్టు కూడా ఉంది. లొసుగులన్నీ తెలిసిపోవడంతో బయటకు పొక్కకుండా అక్రమాలు చేస్తూ వస్తున్నారు. ఇప్పుడు బదిలీల్లో జిల్లా మారితే వ్యాపారాలు, జిల్లాపై పట్టు పోతుందనే కంగారులో ఉన్నారు. జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు డీపీఎంలు ఇలా చేస్తుంటే, వేరే జిల్లాల్లో డీపీఎంలుగా పనిచేస్తున్న నిజామాబాద్‌ వాసులు కూడా అడ్డదారులు తొక్కుతున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్‌ జిల్లాకు ఆప్షన్లు పెట్టుకోగా ఒకరిద్దరు ఉద్యోగులు నిబంధనలు వర్తించని స్పౌజ్‌ సర్టిఫికెట్లు పెట్టినట్లు సమాచారం. ఏళ్లకేళ్లుగా ఒకే సెక్షన్లలో పనిచేస్తున్న డీపీఎంలే కుంటి సాకులు, అడ్డదారులు తొక్కితే, త్వరలో జరిగే కిందిస్థాయి ఉద్యోగులకు ఎలాంటి సంకేతాలు ఇస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. మరి ఉన్నతాధికారులు పైరవీకారులకే పెద్ద పీట వేస్తారా? లేదా న్యాయబద్ధంగా బదిలీలు చేపడుతారా? అనేది ఈ నెల 25న తేలనుంది.

ఓపెన్‌ నేషనల్‌ తైక్వాండో చాంపియన్‌షిప్‌కు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్‌ స్టేడియంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించనున్న ఓపెన్‌ నేషనల్‌ తైక్వాండో చాంపియన్‌షిప్‌కు నిజామాబాద్‌ అమేచూర్‌ తైక్వాండోకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్‌ కార్యదర్శి మనోజ్‌ కుమార్‌, ప్రెసిడెన్సీ హై స్కూల్‌ ప్రిన్సిపల్‌ పవన్‌ కుమార్‌ సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. పిల్లలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు.

తల్లి చేపల వేట షురూ

- తొలి రోజు 4 క్వింటాళ్ల వేట
- రెండు టన్నుల తల్లి చేపలు అవసరం



బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ దిగువన ఉన్న జాతీయ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రంలో చేప పిల్లలను ఉత్పత్తి చేసేందుకు అవసరమైన తల్లి చేపల వేట ఎట్టకేలకు ప్రారంభమైంది. జిల్లాలోని కొన్ని గ్రామాల చెరువులను తల్లి చేపల వేట కోసం అధికారులు ఎంపిక చేశారు. సోమవారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని పెద్ద చెరువులో వేట ను ప్రారంభించారు. తొలిరోజు నాలుగు క్వింటాళ్ల చేపలను సేకరించినట్లు మత్స్య అభివృద్ధి అధికారి దామోదర్‌ తెలిపారు. తల్లి చేపలను జాతీయ చేప పిల్లల కేంద్రానికి తరలించి మట్టి పాండ్లలో నిల్వ ఉంచుతారు. అనంతరం గుడ్లను సేకరించి హేచరీల్లో వేసి చేపపిల్లల ఉత్పత్తి చేపడుతారు. ఈ ప్రక్రియ అంతా జూలై నెలలో ప్రారంభమవుతుంది. అయితే ముందుగా తల్లి చేపల సేకరణ పూర్తి కావాల్సి ఉంటుంది. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో 5 కోట్ల చేపపిల్లల ఉత్పత్తి చేసేందుకు 2 టన్నుల తల్లి చేపలు అవసరం ఉంటుందని మత్స్య అభివృద్ధి అధికారులు తెలుపుతున్నారు. తల్లి చేపల సేకరణ ప్రారంభం కావడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తల్లి చేపల సేకరణను మత్స్యశాఖ ఏడీ ఆంజనేయులు పరిశీలించారు.

క్రైం కార్నర్‌

చెట్టును ఢీకొన్న మోపెడ్‌.. ఒకరి మృతి



నిజాంసాగర్‌(జుక్కల్‌): మండలంలోని సుల్తాన్‌నగర్‌ గ్రామశివారులో సోమవారం ఉదయం మోపెడ్‌ వాహనం చెట్టును ఢీకొని మహమ్మద్‌ గని(36) అనే వ్యక్తి మృతి చెందాడు. మహమ్మద్‌నగర్‌ గ్రామానికి చెందిన గని పాన్‌షాపు డబ్బా నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెట్రోల్‌ కోసం మోపెడ్‌పై వెళ్తున్న గని సుల్తాన్‌నగర్‌ శివారులో ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొన్నాడు. తలపగిలి తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సైనాజ్‌, తల్లి ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి..



మోపాల్‌: మండలంలోని కంజర్‌ గ్రామానికి చెందిన జే శ్రీనివాస్‌ (53) ప్రమాదవశాత్తు చెరువు కాలువలో పడి మృతిచెందినట్లు ఎస్సై యాదగిరి గౌడ్‌ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శ్రీనివాస్‌ రోజూవారీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా పని చేయకుండా తాగుడికి బానిసయ్యాడు. ఈ నెల 2న ఇంట్లో నుంచి వెళ్లిపోయిన శ్రీనివాస్‌.. సోమవారం కంజర్‌ చెరువు కాలువలో మృతదేహమై కనిపించాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొడుకు సుకేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు



నిజాంసాగర్‌(జుక్కల్‌): చోరీ కేసులో ఒకరి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శివకుమార్‌ తెలిపారు. ఈ నెల 8 మహమ్మద్‌ నగర్‌ మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న మన్నె అంజవ్వ ఇంట్లో అత్రం ప్రశాంత్‌ అనే వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. నిందితుడిని సోమవారం అరెస్టు చేసి, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ద్విచక్రవాహన చోరీలో..

నిజాంసాగర్‌(జుక్కల్‌): మాగి గ్రామంలో గత నెల 28న నిర్వహించిన కుస్తీ పోటీల ప్రాంతం నుంచి ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసిన కేసులో నిందితుడు రవిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శివకుమార్‌ తెలిపారు. ఒడ్డేపల్లి గ్రామానికి చెందిన పొట్లోళ్ల సాయిరాం మాగి గ్రామంలో కుస్తీ పోటీలు తిలకించేందుకు పల్సర్‌ బైక్‌పై వచ్చాడు. వాహనాన్ని పార్కింగ్‌ చేసి, కుస్తీపోటీలను తిలకించాడు. అనంతరం వెళ్లి చూడగా బైక్‌ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. నర్సింగ్‌రామ్‌పల్లి చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా పల్సర్‌ బైక్‌పై వెళ్తున్న రవిని పట్టుకొని విచారించామని ఎస్సై తెలిపారు. బైక్‌ను తానే దొంగిలించినట్లు నేరం ఒప్పుకున్నాడని పేర్కొన్నారు. దీంతో వాహనాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌లో తాళం వేసిన ఇంట్లో ఆదివారం రాత్రి దుండగులు చొరబడి భారీ చోరీకి పాల్పడ్డారు. బాల్కొండ ఏఎస్సై చిన్నయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జాకీర్‌ అనే వ్యక్తి తాను అద్దెకు ఉంటున్న ఇంటికి తాళం వేసి సొంతింటికి వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తు తెలియిన దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి ఇంటి నిర్మాణం కోసం బీరువాలో దాచుకున్న రూ. లక్ష నగదును అపహరించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డబ్బుల కోసం తల్లి హత్య

పోలీసుల అదుపులో కొడుకు



చంద్రకళ (ఫైల్‌)

బోధన్‌రూరల్‌: డబ్బులు, నగల కోసం కన్నతల్లిని కొడుకు గొడ్డలితో నరికి హత్య చేసిన ఘటన బోధన్‌ మండలంలో కలకలం రేపింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్‌ మండలం పెంటాకుర్దు గ్రామానికి చెందిన అంబం చంద్రకళకు మహారాష్ట్రకు చెందిన గైక్వాడ్‌ వెంకటితో 40 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు కొడుకులు భూషణ్‌, సురేశ్‌, కూతురు జ్యోతి పుట్టిన తర్వాత చంద్రకళ భర్తకు దూరమై సుమారు 20 ఏళ్ల నుంచి పెంటాకుర్దులోనే ఒంటరిగా జీవిస్తోంది. పిల్లలందరికీ పెళ్లిళ్లు కాగా అప్పుడప్పుడు వారు తల్లి వద్దకు వెచ్చివెళ్తుంటారు. చిన్న కుమారుడు సురేశ్‌ నిత్యం తల్లి దగ్గరకు వచ్చి డబ్బులు తీసుకోవడం, డబ్బులు ఇవ్వకపోతే గొడవ పడుతుండేవాడు. నాలుగు రోజుల క్రితం తల్లి వద్దకు వచ్చిన సురేశ్‌ పెంటాకుర్దులోనే ఉంటూ ఆదివారం డబ్బుల కోసం గొడవకు పడ్డాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో చంద్రకళ (59)ను కిరాతకంగా గొడ్డలితో దాడి చేసి హత్య చేశాడు. అనంతరం ఆమె కాలికి ఉన్న సుమారు 50 తులాల వెండి కడియాన్ని ఎత్తుకెళ్లాడు. సోమవారం చంద్రకళ రక్తపుమడుగులో ఉండటాన్ని చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. బోధన్‌ ఏసీపీ శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో రూరల్‌ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, నిందితుడు సురేశ్‌ను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌ రెడ్డి తెలిపారు.

రైలు ఢీకొని మహిళ మృతి



రైలు పట్టాలపై లక్ష్మీబాయి

ఆర్మూర్‌టౌన్‌/నందిపేట్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లి శివారులో గల రైల్వేట్రాక్‌పై మహిళ మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నందిపేట్‌ మండల కేంద్రానికి చెందిన లక్ష్మీబాయి(50) ఆదివారం పెర్కిట్‌లోని తన కూతురు ఇంటికి వచ్చింది. కూరగాయల వ్యాపారం చేస్తుండేది. కూతురి ఇంటి నుంచి రాత్రి బయల్దేరిన లక్ష్మీబాయిని గుర్తు తెలియని రైలు ఢీకొంది. ఉదయం గూడ్స్‌ రైలు వస్తుండగా ట్రాక్‌పై తీవ్రగాయాలతో ఉన్న ఆమె చేతు ఊపడంతో లోకో పైలెట్‌ గమనించి రైలును నిలిపారు. అనంతరం ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందిందన్నారు. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడు..



ఖలీల్‌వాడి: నగరంలోని శాంతినగర్‌కు చెందిన అబ్దుల్‌ వాజీద్‌ (29) గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. రైల్వే మేనేజర్‌ సమాచారం మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని నిజామాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి



బైండ్ల తేజశ్విని (ఫైల్‌)



తేజశ్విని మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

బోధన్‌: నవీపేట మండల కేంద్ర శివారులోని బాసర-నిజామాబాద్‌ ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థిని మృతి చెందింది. స్థానికులు, కుటుంబ సభ్యుల తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నవీపేట మండలంలోని బినోలా గ్రామానికి చెందిన బైండ్ల గంగాధర్‌ కొన్నేళ్లుగా మండల కేంద్రంలో ఫర్టిలైజర్‌ షాప్‌ నిర్వహిస్తూ ఇక్కడే నివాసం ఉంటున్నారు. గంగాధర్‌కు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు బైండ్ల తేజశ్విని (16) ఇటీవల పదో తరగతి పూర్తి చేయగా, ఇంటర్‌ కోసం నిజామాబాద్‌ నగరంలోని ఓ ప్రైవేట్‌ కళాశాలలో చేర్పించారు. కళాశాల హాస్టల్‌కు వెళ్లేందుకు సోమవారం సాయంత్రం గంగాధర్‌ కూతురు తేజశ్వినితో కలిసి బైక్‌పై ఇంటి నుంచి బయల్దేరారు. మండల కేంద్ర శివారులో బాసర వైపు నుంచి అతివేగంగా వచ్చిన లారీ.. బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ కిందపడిపోగా తీవ్రగాయాలైన తేజశ్విని అక్కడిక్కడే మృతి చెందింది. కళ్ల ముందే కూతురు మరణించడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. గంగాధర్‌ ఫిర్యాదు మేరకు నవీపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల సంతకాలు ఫోర్జరీ

- కానిస్టేబుల్‌పై సస్పెన్షన్‌ వేటు

కామారెడ్డి క్రైం: విధులకు గైర్హాజరు కావడమే కాకుండా ఉన్నతాధికారుల సంతకాలు ఫోర్జరీ చేసిన వ్యవహారంలో ఓ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్‌ వేటు పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. కే రవి కుమార్‌ అనే కానిస్టేబుల్‌ ఇటీవలే బదిలీపై దేవునిపల్లి పీఎస్‌కు వచ్చాడు. ఇది వరకు పెద్దకొడప్‌గల్‌ పోలీస్‌ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఏఎస్సై సంతకాలు ఫోర్జరీ చేసి బస్సు వారంట్లను దుర్వినియోగం చేశాడు. విధులకు గైర్హాజరు కావడం, బదులుగా ఎస్సై సంతకాన్ని ఫోర్జరీ చేసి పై అధికారులకు నివేదికలు పంపించాడు. పలు విషయాల్లో రవికుమార్‌పై ఆరోపణలు రావడంతో బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి విచారణ జరిపి ఎస్పీ రాజేశ్‌చంద్రకు నివేదిక సమర్పించారు. దీంతో రవికుమార్‌ను సస్పెండ్‌ చేస్తూ ఎస్పీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధులలో ఎవరైనా నిర్లక్ష్యం వహించినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): మండలంలోని నికాల్‌పూర్‌ గ్రామానికి చెందిన ఆదిమూలం భానుచందర్‌ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భానుచందర్‌ గ్రామంలోనే టైలరింగ్‌ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన కూతురిని ఉన్నత చదువులు చదివించేందుకు డబ్బులు లేక ఆర్థికంగా ఇబ్బందులకు గురై మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తితో ఆదివారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసులపై హత్యాయత్నం.. నిందితుల అరెస్టు

మోర్తాడ్‌: మండలంలోని దొన్కల్‌ శివారులో ఉన్న దాబా వద్ద సోమవారం తెల్లవారుజామున విధుల్లో ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లపై యువకులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. భీమ్‌గల్‌ సర్కిల్‌ పరిధిలోని ఐడీ పార్టీ సిబ్బంది సోపారపు వినయ్‌, షౌకత్‌ అలీ విధులు నిర్వర్తిస్తుండగా మోర్తాడ్‌కు చెందిన భూపతి, శివకుమార్‌, శివవర్ధన్‌, శశి, శేఖర్‌లు దాడి చేసి కారులో పరారయ్యారు. దీంతో కేసును సీరియస్‌గా పరిగణించి దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విక్రమ్‌ తెలిపారు. విధులు నిర్వర్తించే ప్రభుత్వ అధికారులు, సిబ్బందిపై దాడి చేసి ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎస్సై హెచ్చరించారు.